అడవిలోని మొట్టమొదటి తురాయి మొగ్గ కళ్ళు విప్పింది.

మూడురోజులుగా ఎదురుచూస్తున్నాను.

అది విచ్చుకునే గొప్ప దృశ్యం కోసం.

అడవికి మిగిలిన చివరి ఆశ ఈ తురాయి చెట్టే.

మోదుగ చెట్లున్నాయి గానీ వాటికి తొందరెక్కువ.

అట్లా ఎర్రగా మిలమిలలాడి మనం గమనించే లోపలే, మొండిగా, నగ్నంగా మారిపోతాయి.

మొదటి మొగ్గ కళ్ళువిప్పింది.

ఇక గొప్ప సంగీత సభ.

అన్నివైపుల నుండి కమ్ముకొస్తూ, ఏ గద్దరో ఎర్రని పాటల్ని అట్లా వెదజల్లుకుంటూ వెళుతున్నట్లు;

అడవి ఇప్పుడు నిప్పుకోడి.

కథ

నిజానికి అడవిలోకి వెళ్ళవద్దని మిత్రుల సలహా. చర్చల కల ముగిసి, మళ్ళీ అడవిలో పొదలకు తుపాకులు మొలుస్తున్నాయని హెచ్చరిక లిచ్చారు. అయినా దిరిసెన మొగ్గలు కళ్ళు విప్పే, ఫ్లూటు, తబలా, వయొలెనుల రాగాలని విరజిమ్మే, ఎర్రని నవంబరు నెలకోసం ఎన్నోరోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. వారంరోజులుగా రంగుల సంచిని, కాన్వాస్‌ని మోసుకొని తిరుగుతున్నాను. ఎర్రని దిరిసెన మొగ్గల్ని రంగుల్లోకి అనువదించే అవకాశం ఇప్పటికి దొరికింది.

రెండు పాయల నది, ఎత్తుగా పెరిగిన గడ్డి, రవ్వగాలి మోత. నది ఒక పాయను ఆనుకొని ఎత్తైన కొండ వృద్ధ మునిలా. నదిలో ఈత కొట్టే (పశువులు కాసే) కుర్రవాళ్ళ అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. పచ్చిక నుంచో, నీటి నుంచి ఎగిసివచ్చే వింత పరిమళం. అడవి వాసన, పిల్లల అరుపులు, దిరిసెన పువ్వుల సౌందర్యంతోపాటు, ఆసక్తి గొలిపే మరో దృశ్యం; వందగజాల దూరంలో ఎత్తైన రాతిపై కూర్చొన్న నడికారు మనిషి. పొడవాటి గాలాన్ని నదిలోకి వేసి (అది చేపల్ని పట్టడానికి కాకుండా, నదితోటి సంభాషించడానికన్నట్లు) నది వైపేచూస్తూ (ఉదయంనుంచీ అట్లాగే చూస్తున్నాడు.) దిరిసెన మొగ్గల్ని చూస్తూ అడవంతా పిచ్చివాడిలా తిరుగుతున్న నాకు, ఈ నడికారు మనిషి రూపం ఏ మూల కెళ్ళినా వెంటాడుతుంది. నిన్న సాయంకాలం పెద్దవాన. అడవి నంతా తడిపివేసింది. సన్నటి మబ్బు (నల్లటిది) ఆకాశం పైనుంచి వేలాడుతుంది. కొండలవైపు ఉరుములు. గాలితో అటూఇటూ ఊగిసలాడుతూ మెరుపులు.

అనువైన చెట్టు కింద, నా రంగుల సామాన్లు దించుకొని, క్రమంగా, ఒక మూడ్‌లోకి వెళ్ళే ప్రయ త్నం. నడికారు మనిషి రూపం నిరంతర దృశ్యంలా కనిపిస్తూనే ఉంది. ఒక్క చేప కూడ పడినట్లు లేదు. గాలం పైకి లాగి రెండుమూడు వానపాముల్ని గుచ్చి మళ్ళీ నీళ్ళలోకి వేశాడు. ఎన్నిసార్లు గాలాన్ని పైకిలాగినా, అది ఖాళీగానే ఉంటుంది. (చేపల కట్లా తిండి వేయడానికే అతను అక్కడ కూర్చున్నట్లుగా ఉంది.) మధ్యలో ఒకసారి నావైపు తిరిగి పలకరింపుగా నవ్వాడు. అతని ముఖం

## డా॥ వి. చంద్రశేఖరరావు

ఎక్కడో చూసినట్లుగా ఉంది. సన్నగా, పొడవుగా వయసు ఎంత ఉంటుందో చెప్పలేన్నట్లుగా ఉంది, అతని ముఖం. నెరసిన జుట్టుకు గోరింట పూసినట్లుగా ఉంది. ఎర్రగా, భయం గొలిపేలా ఉంది జుట్టు. అతనట్లా నదివైపుకు, నది అవతల నుండి కొండవైపుకు చూస్తునే ఉన్నాడు. గాలిలోని పరిమళాలు, పిల్లవాళ్ళ శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. నడికారు మనిషి యోగముద్ర కొనసాగుతూనే ఉంది. అడవి పక్కన ఊరు లోంచి, లౌడ్‌స్పీకరులోంచి ప్రకటనలేవో వినిపిస్తున్నాయి. ఊళ్ళో సాయంకాలం జరగబోయే సభ గురించి. మొరటుగా, పెద్దగా, తుపాకి పేలిన చప్పుడులా వినిపిస్తున్నాయి ఆ ప్రకటనలు. రిజర్వే షన్లు, వర్గీకరణ, సభ, నిరసన, దళిత నాయకులు, పదాలన్నీ కలిసి పోయి, ఒక్కసారిగా పేలిన తూటా శబ్దాల్లా వినిపిస్తున్నాయి. ఆ శబ్దాలకు నడికారు మనిషి ఏకాంత ముద్ర చెదిరినట్లుగా ఉంది. విసుగ్గాలేచి, నిలబడి గాలాన్ని బయటకు లాగి, దారాన్ని కర్రకు చుట్టి, ఏదో గుర్తుకొచ్చిన వాడిలా లేచి నిల్చున్నాడు. మొదటిసారిగా ఆ ప్రదేశాన్ని చూస్తున్నట్లుగా, నాలుగు వైపుల పరి

# ద్రోహవృక్షం



కించి చూశాడు. ఎత్తైన కొండవైపు సాలో చనగా చూశాడు. నదివైపు, పిల్లల అరుపులు వస్తున్న వైపు. చివరిగా నావైపు. ఆసక్తితో నావైపు చాలాసేపు చూశాడు. లేచి తూర్పుదిశగా నడక మొదలుపెట్టి, హఠాత్తుగా, ఏదో గుర్తుకొచ్చినట్లు, నావైపు నడి చాడు.

ఎర్రటి గుండ్రటి ముఖం అతనిది. పొడవాటి మీసం. జుట్టు మాత్రం ఎర్రటి రంగులో ప్రత్యేకంగా ఉంది. కళ్ళు మిలమిల లాడుతూ మత్తుగా, నవ్వుతున్నట్లుగా ఉన్నాయి.

"నన్ను ఇదివరకెప్పుడైనా చూశావా?" అన్నాడు ఏ ఉపోద్ఘాతం లేకుండా.

"అద్భుతంగా ఉన్నాయి కదూ!" అన్నాడు చెట్టుపైనున్న పూలవైపు, నా కాన్వాస్ పైనున్న పూలవైపు మార్చిమార్చి చూస్తూ.

" 'జూడాస్ ట్రీ' అంటే తెలుసా నీకు?" అన్నాడు నావైపు సూటిగా చూస్తూ.

"నేనో స్కూలు టీచర్ని. ఇరవైయేళ్ళుగా ఇక్కడే ఉంటున్నాను. ప్రాజెక్టు వాళ్ళు పెట్టిన స్కూలు. ఇప్పుడందులో దళితవాడల్లోని పిల్లలే చదువుతున్నారు. ఒకళ్ళిద్దరు చెంచుల పిల్లలు" అన్నాడు స్వగతంలో లాగా.

"నువ్వింత శ్రమపడి బొమ్మవేస్తున్న ఈ దిరిసెన చెట్టును జూడాస్ ట్రీ అని కూడా అంటారు. ఈ చెట్టుకో చరిత్ర ఉంది."

"బైబిలు, న్యూ టెస్టిమెంటు, జీసస్ క్రైస్టు గురించి వినే ఉంటావు. క్రైస్టును శిలువ వెయ్యడానికి పట్టి యిచ్చిన శిష్యుడు పేరు జూడా. క్రైస్టును పట్టి ఇచ్చినాక పశ్చాత్తాపపడి 'పవిత్ర రక్తాన్ని మోసం చేసిన పాపిని' అంటూ ఆవేదనపడి, ఊరి బయటనున్న వంటరి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మరుసటిరోజు చెట్టు మొత్తం వెలిగిపోయి, దాని కొమ్మల నిండా ఎర్రటి పూలు (జూడా జుట్టు ఎర్రగా వెలిగి పోతుం టుంది) పూశాయి. ఆ చెట్టే యిది." అని క్షణంసేపు ఆగి, "ఈ రంగు పూలను చూసి మోసపోకు. దీని అందాలను చూసి మోహపడకు. ఇది నమ్మకద్రోహం నుంచి పుట్టిన అందం." అని "నా జుట్టు చూశావా? ఎర్రటి రంగులో మిలమిలలాడుతూ, బహుశా జూడా రక్తం నాలోనూ పారుతుందేమో?" అని, మళ్ళీకొద్ది క్షణాలు ఆగి, "నా పేరు ఉ.కొండయ్య. మనిద్దరం ముప్పయి యేళ్ళ క్రితం ఈ ప్రాంతాల్లోనే తిరిగాము. బహుశా నీకు గుర్తు ఉండి ఉండదు. సిటీ మనిషి అయ్యావు. అయ్యేయస్ పరీక్షేదో రాసినట్టున్నావు. మనం మళ్ళీ ఇట్లా, జూడాస్ చెట్టు దగ్గర కలుసుకోవటం కాకతాళీయం మాత్రం కాదు."

"మైకులో ప్రకటన విన్నావుకదా. ఒక సభ కాదు. రెండు సభలు జరగబోతున్నాయి. బహుశా కొట్లాటలు కూడా జరగవచ్చు. బహుశా ఎర్రటి జూడా పూలరంగు రక్తాలు కూడా పారవచ్చు. ఇక అడవంతా ఎర్ర పూల సౌంద ర్యమే. నీ కుంచె పట్టినంత..."

"ఉ.కొండయ్యను; గుర్తుకొచ్చానా?" అంటూ గంభీరంగా అడుగు వేసుకుంటూ ఊరువైపుకు నడిచాడు అతను.

> గబగబా అడుగులు వేసి, నాకు దూరంగా జరిగాడు కొండయ్య. నేనదేమీ పట్టించుకోకుండా వాడి పక్కనే నడవటం మొదలు పెట్టాను. వాడు క్రమంగా దూరం జరుగుతున్నాడు. హఠాత్తుగా కిందకువంగి, నేలపై రాయి తీసి "బుర్ర పగులుద్ది!" అని అరిచాడు. అని రాయిని నావైపు విసిరాడు. నేను ముందుకు వంగి, దాన్ని తప్పించుకొన్నాను. ఒక నిముషం ఆగి, నేను కూడా ఒక రాయిని చేతిలోకి తీసుకున్నాను.

** ** **

## 2

నది అంచు పైనున్న కాలిబాటన నడిచి వెళుతుంటే, రేవులో ఈత గొడుతున్న కుర్రాడు కనిపించాడు. దాదాపు నగ్నంగా ఉన్నాడు. నడుంచుట్టూ ఒట్టి మొలగుడ్డ. నీటిపై తేలాడుతూ, చేతులతో, అటూ, ఇటూ టపటపమని కొడుతూ, ముఖమంతా నీళ్ళలో మునిగి ఉంది గాని, జుట్టు మాత్రం నీటిపైనే ఉంది. ఎర్రటి జేగురు రంగు జుట్టు. నూదుల కట్టలా నిక్కబొడుచుకొని ఉంది. వాణ్ణి వెంటనే గుర్తు పట్టాను. కొండయ్య.(ఇంటిపేరు ఉమ్మేటి. బడిలో వాణ్ణి ఉ.కొండయ్య అని పిలుస్తారు) వాణ్ణి గుర్తుపట్టగానే నాలో బుసబుస మంటూ కోపం



రేగింది. పొదల్లోంచి నాలుగైదు రాళ్ళను ఏరాను. నన్ను చూడగానే వాడికళ్ళలోనూ భయం. వంటరిగా దొరికాడు. ఎప్పుడూ గుంపుగా తిరిగేవాళ్ళు. వద్దుపైనుండే "ఒరేయ్, ఇవాళ నువ్వు నా చేతిలో అయిపోయావురా!" అని అరుస్తూ రాళ్ళను వాడివైపుకు విసరటం మొదలుపెట్టాను.

కొండయ్య నా శత్రువు. ఇన్నాళ్ళకు దొరికాడు. వాడు వేగంగా అవతల వద్దుకు ఈదుతున్నాడు. ఆవైపున కొండ ఉంది. కొండపైకి ఎగబాగి పరిగెత్తాలని వాడి ప్లాన్. రాళ్ళు విసురుకోవటం, కొట్టుకోవటం మాకు కొత్తకాదు. కానీ ఎవరం ఇట్లా వంటరిగా దొరకం. మామూలుగయితే కొండయ్య దగ్గర చెంచుపిల్లల దగ్గర సంపాదించిన దబ్బ (విల్లు, బాణం) ఉంటుంది. అది ఉన్నంతసేపూ వాణ్ణి కొట్టటం, మనవల్లగాదు. గెరిల్లా యుద్ధ తంత్రం వాడిది. కాళ్ళపై బాణాలతో కొట్టి, ముఖంపై దబదబా గుద్ది నిముషాల్లో మాయమవుతాడు. మా యిద్దరి బళ్ళు వేరువేరుగాని (మేముండే బడిలో వాళ్ళ పిల్లల్ని చదివించమని వేరే బడి పెట్టుకున్నారు వాళ్ళు), వదిలిపెట్టే టైము ఒకటే. బడి సంచుల నిండా రాళ్ళు రడీగా ఉంటాయి.

"సంగీతగా (సంగీతరావు నా పేరు) చచ్చేవురా!" అంటూ రాళ్ళు విసిరి, క్షణాల్లో పొదల్లో మాయమవుతాడు. ఇవాళ వాడు వంటరిగా, నిరాయుధంగా దొరి కాడు.

వాడు నా ముఖ్యమైన శత్రువు. "వాళ్ళను నమ్మవద్దు. వాళ్ళ పొడ కూడా మనమీద పడకూడదు" అని మా యింట్లో రోజూ చెబుతుంటారు. రెండు కులాల మధ్య నాలుగైదు సార్లు పెద్దపెద్ద కొట్లాటలే జరిగాయి. హత్య కేసులు, కోర్టు వాయిదాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. నాకు ఆరేళ్ళప్పుడు, ఒక అర్ధరాత్రి వేళ మా యిళ్ళలోంచి మంటలు లేచాయి. ఒకటి రెండు సామాన్లు నెత్తిన పెట్టుకొని, పెద్దగా ఏడ్చుకుంటూ వీధుల్లోకి పరిగెత్తాము. ఇది జరిగిన వారానికి వాళ్ళ యిళ్ళు కూడా తగలబడ్డాయి. ఊరికి ఆ చివరన వాళ్ళ యిళ్ళు, ఈ చివరన మా యిళ్ళు. వాళ్ళ వీధిపై నుండి కూడా వెళ్ళవద్దని మా పెద్దవాళ్ళ ఆర్డర్.

మొత్తానికి, ఇవాళ వాడు నాకు దొరికాడు. వాడు మంచి ఈతగాడు. దెబ్బకు అందకుండా, నీళ్ళలో మునుగుతూ, తేలుతూ రేవంతా ఈదుతున్నాడు. అందమైన ముఖం వాడిది. తేనెరంగు కళ్ళు.

ముఖంలో ఇంకా పసితనం పోలేదు. పావుగంటసేపు వాడు నన్ను తప్పించుకుని నీళ్ళలోనే తిరుగుతున్నాడు.

ఇక లాభంలేదని నేనూ నీళ్ళలోకి దూకాను. వాడు నాకు అందకుండా పాములా దూసుకుపోతున్నాడు. సన్నటి రవ్వగాలి నీళ్ళను చిందరవందర చేస్తుంది. నీళ్ళలో వాడి ఎరుపురంగు జుట్టు మెరుస్తూనే ఉంది. దగ్గరగా వెళ్ళి, వాడి చొక్కా పట్టుకొని లాగాను. వాడి కళ్ళలో భయం. పెదాలు అదురుతున్నాయి. "రేయ్, ఈరోజు నువ్వు అయిపొయ్యావురా!" అంటూ అరిచాను. వాడు నా చెయ్యి విదిలించుకొని ఒడ్డుకి పరిగెత్తాడు. పొదల్లో ఉన్న నిక్కరు, చొక్కా వేసుకున్నాడు. నేనింకా నీళ్ళలోనే ఉన్నాను. 'ఇక వీడు రాళ్ళు విసురుతాడు' అనుకున్నాను గానీ, వాడు మాత్రం మౌనంగా నావైపు నడిచాడు. ఆడపిల్లల ముఖంలో ఉండే మృదుత్వం ఉంది వాడి ముఖంలో. దగ్గరకు వచ్చి "చలివేయటం లేదా?" అన్నాడు. నేను ఏం మాట్లాడలేదు. వడ్డుపైకి ఈదుకుంటూ వచ్చాను. "నిన్నెవరురా మా రేవులో ఈతకొట్టమంది" అన్నాను గొంతులో కరకుదనంతో.

ఎండిన ఆకులన్నీ గలగల శబ్దం చేస్తున్నాయి. దూరంగా నీళ్ళు ప్రవహిస్తున్న చప్పుడు. ఉ.కొండయ్యతోటి నా చిన్నప్పటి జ్ఞాపకం, కొద్దినిముషాల క్రితమే జరిగి నట్లుగా ఉంది. నాఫాంటు రెండు జేబు లు బరువుగా కంకర రాళ్ళతో నిండిన ట్లుగా అనిపించసాగింది. కొండవైపు చూశాను. ఇప్పుడు నేను, ఉ.కొండయ్య కలిసి మళ్ళీ ఆ కొండను ఎక్కగలమా? అని ఆలోచించాను.

"మీరేవా? అట్లా అని ఎక్కడన్నా రాసుందా?" అన్నాడు; వాడి ముఖంలో సన్నటి నవ్వు. "దీన్ని కనిపెట్టింది మేము. కొండల చాటున, ఇన్నాళ్ళు ఎవరూ దీన్ని చూడలేదు" అన్నాను అసహనంగా. "కుంటల్లో నీళ్ళలా, కదలకుండా ఉంటాయి ఇక్కడ నీళ్ళు" అన్నాడు సర్టిఫికేటు ఇస్తున్నట్టుగా. వాడు హఠాత్తుగా నావైపు తిరిగి "చేతికి దొరికినా ఎందుకు వదిలేశావు?" అన్నాడు. కాసేపు ఆలోచించి "కావాలనే నిన్ను వదిలేశాను. నీతో మాట్లాడాలని ఆగాను. మేమంటే ఏమిటో మీకు తెలియాలి. బుర్రలేని వెధవలు మీరు. ఆ విషయం నీకు చెప్పాలని. 'ఐక్యరాజ్య సమితి' అంటే తెలుసా నీకు? అలీన దేశాలంటే తెలుసా? ప్రచ్ఛన్నయుద్ధం అంటే? అరే అసలు నువ్వు సొంతంగా 'నా పేరు కొండయ్య' అని ఇంగ్లీషులో చెప్పగలవురా?" అన్నాను అక్కసుగా.

"లెక్కల్లో నాకు 94 తెలుసా? ఆల్జీబ్రాకు మనమంటే గాబరా?" అన్నాడు కొండయ్య ఉక్రోషంగా.

"అరేయి తెలుగు పద్యాన్ని తప్పులు లేకుండా చెప్పగలవురా? 'ఆకాశంబున నుండి శంభుని శిరమ్ము' పద్యం చెప్పరా నాలిక మందపోడా?" అన్నాను సవాలుగా.



"ఆ పద్యవేమిటి? నాకు జాషువా పద్యాలన్నీ కంఠతా వచ్చు. గబ్బిలం పద్యాలు గడగడా చెప్పనా?" అన్నాడు.

మెల్లిగా పొదల్ని దాటి ముందుకు నడిచాము. కొండయ్య నా శత్రువు. వాడి దగ్గర అలుసయిపోవటం నాకిష్టంలేదు." అరేయ్, కొండలెక్కటం వచ్చురా నీకు. ఈ ఎదురుగ్గా ఉన్న కొండను అరగంటలో ఎక్కి, దిగగలను తెలుసా?" అన్నాను గర్వంగా. "నీ గురించి మావాళ్ళు చెప్పుకుంటారు. కొండల ఎక్కటంలో, నీ తరువాతే ఎవరైనా? అని" అని ఒప్పుకొన్నాడు వాడు. నా బుగ్గలు ఎరుపెక్కాయి. మేమిద్దరం శత్రువులమన్న విషయం మరిచిపొయ్యాము." ఇదుగో, ఈ ఎదురుకొండ ఎక్కినోడురా మొనగాడంటే. మధ్యదాకా పొదలు, చిల్లచెట్లు ఉంటాయి గానీ, ఆపైన నున్నగా, జారతా ఉంటది. ఏమాత్రం పట్టు తప్పినా పులుసులోకి కూడా దొరకం..." అన్నాను గర్వంగా.

"నేను చాలాసార్లు, సగందాకా ఎక్కి భయంతో వెనక్కు వచ్చాను." వాడు చెబుతుంటే నా సంతోషానికి హద్దులేదు. "అసలు మీవాళ్ళే అంతేరా, దమ్ములేనోళ్ళు." అన్నాను ఏదో గుర్తుకొచ్చినట్లుగా. కొండయ్య ఏం మాట్లాడలేదు. "నన్ను నీతోపాటు కొండపైకి తీసుకెళ్ళు, సగం నుంచే భయం నాకు. నువ్వుంటే ధైర్యంగా వస్తాను" అన్నాడు కొండవైపుకు నడుస్తూ.

"ఊబవళ్ళు నీది! నువ్వేం ఎక్కగలవురా?" అన్నాను.

"లేదు, నేను కూడా వస్తాను" అంటూ నాతోపాటు నడిచాడు.

కొండ ఎక్కటం మొదలుపెట్టాము. సగం దాకా ఇబ్బందేమీ లేదు. నేను చకచకా పరిగెత్తాను. మధ్యదాకా పచ్చిక ఉంది. ఇబ్బంది లేదు. రెండు మూడు చోట్ల వాడు జారబోతే చెయ్యి పట్టుకొని ఆపాను. పొదలు, పచ్చిక అయిపోయినాక, కోసుగా ఉండే పర్వతం మొదలైంది. నునుపుగా, త్రిభుజంలా ఉండే అంచు అది. ఎటువైపు నుంచీ పట్టు దొరకదు. మేకలు కూడా అటుపైకి ఎక్కలేవు. ఆ అంచుదాకా వచ్చినాక కొండయ్య భయపడ్డాడు. వాడి చేతులు వణకటం గమనించాను. ముఖం నిండా చెమట. ఇంకా ముందుకొస్తావా? ఆగిపోతావా?" అన్నాను. నునుపుగా, ఏ ఆధారంలేని కొండ అంచు చూసి కొద్దిగా జంకాడు.

"వద్దన్నా, అస్సలు పట్టుదొరకదు. నువ్వు కూడా ఎక్కొద్దు." అన్నాడు వాడు. "పోరా సన్నాసి" అంటూ ముందుకు కదిలాను. శిఖరంపై అక్కడక్కడా ముందుకు పొడుచుకొచ్చిన గణుసులున్నాయి. కాళ్ళను వాటిపై అదిమిపెట్టి, రెండు చేతుల్తో ముందుకు పాకాను. కొండయ్య నాతోటే పైకి వస్తున్నాడు. కాస్త దూరం పోయినాక నున్నటి గ్రానైట్‌పై అక్కడక్కడ పగుళ్ళు కనబడ్డాయి. అట్లాగే పగుళ్ళను మెట్లలాగా పట్టుకొని పైకి పాకాను. అంచుమీద కాలును బలంగా తొక్కిపెట్టి, కొండయ్య చేతిని అందుకున్నాను. అక్కడ నుండి చూస్తే సన్నటి దారపు పోగులా ఉంది నది. అడవి చీమట పుట్టలా ఉంది. గాలి బలంగా వీస్తుంది. ఇంకొక్క ఇరవై అడుగులు వెళితే కొండ చివరిభాగం వస్తుంది. ఈ భాగమంతా నున్నగా మెరుస్తుంది. పొట్టతోనే పాక్కుంటూ వెళ్ళాలి. కొండయ్య నా వెనకనే వస్తున్నాడు. వాడి ధైర్యానికి ఆశ్చర్యపోయాను. 'శభాషో' అనుకున్నాను. ఒక్కో అడుగు ముందుకు వెళుతుంటే, భయంగానూ థ్రిల్‌గానూ ఉంది. అక్కడక్కడా పగుళ్ళు కనబడ్డాయి. వాటిల్లో చేతుల్ని ఇరికించుకొని ముందుకు పాకాము. శిఖరం అంచుకు చేరి; అక్కడ కూలబడ్డాము. అక్కడ కూర్చుని చుట్టూ ఉన్న కొండల్ని, అడవిని చూస్తుంటే అవన్నీ మేము జయించిన రాజ్యాలుగా తోచాయి. పైకి చెయ్యి చాపితే మబ్బులు అందుతున్నాయి. శిరస్సుపై మబ్బులు కిరీటం పెట్టుకొన్న ఇద్దరు యువరాజుల్లా మిలమిలలాడాము. నా శత్రువూ, నేను కలసి సాధించిన విజయం ఇది. ఎందుకో వాణ్ణి శత్రువు అనుకోవాలనిపించలేదు. మా ఇష్టాలు, ఆనందాలు, ఒక్కలానే ఉన్నాయి. తెలియని స్నేహ భావం ఏదో మమ్మల్ని కమ్ముకుంది." నల్లమల కొండల్లోనే ఎత్తైన కొండ ఇది. ఎవ్వరూ, ఇంత ఎత్తుకు ఎక్కలేదు. ఈ కొండకు మనమే టెన్సింగ్ నార్కే, ఎడ్మండ్ హిల్లరీలం" అన్నాడు కొండయ్య గర్వంగా. ఇద్దరం చాలాసేపు కబుర్లు చెప్పుకొన్నాము. అద్భుతమైన విహారం అది. సరస్సులు, నదులు, అడవులు, మధురమైన ఫలాలు, చిన్నప్పటి జ్ఞాపకాలు, అట్లా మాట్లాడుకుంటూనే ఉన్నాము. ఆ కబుర్లలో మాదైన ఒక గతాన్ని గుర్తు

పట్టాము. మా దుఃఖాలు, పోరాటాలు, మా పూర్వీకుల అవమానాలు, కన్నీళ్ళు అన్నీ గుర్తు చేసుకున్నాము. మా ఇద్దరి రక్తాల్లో ప్రవహించే చరిత్ర ఒక్కటే అని తెల్సుకున్నాము. దగ్గరగా చూస్తే మా ఇద్దరిలో ఎన్నో పోలికలు. ముక్కుతీరు, లావాటి పెదాలు, మాటలు ఉచ్చారణ. ఇవన్నీ అర్థమవుతుంటే ఎంతో ఆశ్చర్యం. కబుర్ల మధ్యలో వాడి భుజంపై చెయ్యివేసి; అద్భుతంగా ఉందా స్పర్శ. అట్లాగే కబుర్లు చెప్పుకుంటూ కొండ దిగటం మొదలు పెట్టాము.

కొండ దిగి, చిట్టడవిని దాటి, ఇద్దరం ఊరు వైపు నడిచాము. మేకలు కాసే కుర్రవాళ్ళు ఇద్దరు మావైపు ఆశ్చర్యంగా చూశారు. ఊళ్ళోకి వచ్చినాక, వాళ్ళ వీధిలో కట్టలు కొట్టుకుంటున్న ముసిలివాడు ఒకడు మమ్మల్ని చూసి ముఖం చిట్లించాడు. కొండయ్యలో క్రమంగా బెరుకు మొదలైంది. "మనం దూరం దూరంగా నడుద్దాం" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. గబగబా అడుగులు వేసి, నాకు దూరంగా జరిగాడు కొండయ్య. నేనదేమీ పట్టించుకోకుండా వాడి పక్కనే నడవటం మొదలు పెట్టాను. వాడు క్రమంగా దూరం జరుగుతున్నాడు. హఠాత్తుగా కిందకు వంగి, నేలపై రాయి తీసి "బుర్ర పగులుద్ది!" అని అరిచాడు. అని రాయిని నావైపు విసిరాడు. నేను ముందుకు వంగి, దాన్ని తప్పించుకొన్నాను. ఒక నిముషం ఆగి, నేను కూడా ఒక రాయిని చేతిలోకి తీసుకున్నాను.

** ** **

3

ఉ.కొండయ్య వెళ్ళిపోయి చాలా సేపయింది. గాలి బలంగా వీస్తుంది. ఎండిన ఆకులన్నీ గలగల శబ్దం చేస్తున్నాయి. దూరంగా నీళ్ళు ప్రవహిస్తున్న చప్పుడు.

ఉ.కొండయ్యతోటి నా చిన్నప్పటి జ్ఞాపకం, కొద్దినిముషాల క్రితమే జరిగినట్లుగా ఉంది. నాఫాంటు రెండు జేబులు బరువుగా కంకర రాళ్ళతో నిండినట్లుగా అనిపించసాగింది. కొండవైపు చూశాను.ఇప్పుడు నేను, ఉ.కొండయ్య కలిసి మళ్ళీ ఆ కొండను ఎక్కగలమా? అని ఆలోచించాను.

అడవి అవతల ఊళ్ళో గొడవ గొడవగా ఉంది. బహుశా ఉ.కొండయ్య చెప్పినట్లు రెండు సభలు మొదలయి ఉంటాయి.

# "చరితార్థుడు"

ఇవ్వాళ చౌరస్తాలో
ఓ నల్లజెండా
గుండెలో చీకటిని నింపింది
ఒక వీరుడి విషాదం
మేఘమై అశ్రువర్షం కురిసింది-
అతడి మరణం సహజమో
అసహజమో
'ఎన్‌కౌంటరో'
డాక్టర్ల నిర్లక్ష్యమో
ఏదైనా కావొచ్చు
కానీ...
అది ఒక గర్భశోకం
ఒక సోదరి భ్రాతృవియోగం
మిత్రులకు నిరంతర దుఃఖ స్మృతి-

అతడు
సామాజిక యోధుడా!?
ఉద్యమ శూరుడా!?
కలం కార్మికుడా!?
అతడి కోసం
చౌరస్తా ఒక సంతాప సంకేతంగా
స్తంభించిపోయింది-
నిజానికి...
చౌరస్తా అందరికీ కన్నీళ్లు కార్చదు

- డా॥ ఎస్వీ సత్యనారాయణ

# ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారాలు

ఉత్తమ కవితా సంపుటాలకు ఇచ్చే ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారాల్ని ప్రముఖ విమర్శకుడు, కవి అద్దేపల్లి రామమోహనరావు, కవి కందుకూరి శ్రీరాములుకు ప్రకటించారు. అద్దేపల్లి రాసిన 'అయినా ధైర్యంగానే' అనే కవితా సంపుటిని 2002 సంవత్సరానికిగాను, కందుకూరి శ్రీరాములు రాసిన 'సందర్భం' కవితా సంపుటికి 2003 సంవత్సరానికి గాను ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారాలకు ఎంపిక చేశారు.

# ఒరియాలోకి నగ్నముని 'కొయ్యగుర్రం'

ప్రముఖ కవి నగ్నముని 'కొయ్యగుర్రం' కావ్యం తాజాగా ఒరియా భాషలోకి అనువాదమైంది. దీనిని తెలుగులోంచి ఒరియా భాషలోకి ఉపద్రష్ట అనూరాధ అనువదించారు. 1997 నవంబర్‌లో ఆయన ఈ కావ్యాన్ని రాశారు. ఇప్పటివరకు రష్యన్, ఇంగ్లీషు, హిందీ, కన్నడం, తమిళం, మైథిలి, పంజాబీ, మరాఠీలోకి అనువాదమైంది. ఇప్పుడు ఒరియాలోకి అనువాదమైంది. ఈ పుస్తకాన్ని అనువాదం చేసిన అనూరాధ మంచి అనువాదకురాలు. వివిధ భాషల్నించి తెలుగులోకి అనేక కథల్ని అనువాదం చేశారు

# సాంస్కృతిక ఫాసిజానికి వ్యతిరేకంగా సెమినార్

పార్లమెంటరీ రాజకీయ పోరాటంలో హిందూత్వ శక్తులు తాత్కాలిక ఓటమి పొందినప్పటికీ దాని సామాజిక మూలాలు ఓటమి పొందలేదు. కనుక లౌకికవాదులు మరింత అప్రమత్తంగా ఉంటూ సాంస్కృతిక ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక (ఎస్.డి.ఎల్.సి.ఎఫ్) నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 26 ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సెమినార్ నిర్వహిస్తుంది. మొదటి సెషన్‌కి ముఖ్య అతిథిగా డా॥ రాజబహదూర్ గౌర్ హాజరవుతారు. సంఘ్ పరివార్ సాంస్కృతిక జాతీయవాదం తాత్విక మూలాలు అనే అంశంపై ప్రొ॥ జ్యోతిర్మయి శర్మ ప్రసంగిస్తారు. జాతీయోద్యమంలో ఆర్ఎస్ఎస్-సావర్కర్ పాత్రపై ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ, గ్లోబలైజేషన్, కల్చర్-మతోన్మాదం అనే అంశంపై ఎ.బి.కె.ప్రసాద్ ఉపన్యసిస్తారు. మధ్యాహ్నం జరిగే రెండో సెషన్‌లో సెక్యులరిజం- ఉర్దూ, తెలుగు, హిందీ సాహిత్యాలపై తెలకపల్లి రవి, మజహర్ మెహది, నిర్మలానంద, స్కైబ్ ప్రసంగిస్తారు. ఇంకా ఈ కార్యక్రమంలో డా॥ బాలగోపాల్, ప్రొ॥ ఎస్.వి.సత్యనారాయణ, జయధీర్ తిరుమలరావు, ఎం.రత్నమాల, సామ్‌పాల్, జక్కంపూడి నాగేశ్వరరావు, షరీఫ్ మొదలైనవారు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న సాంస్కృతిక ఫాసిజాన్ని ప్రతిఘటించడానికి రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు ముందుకు రావాల్సిన అవసరముందని, కనుకనే ఈ సెమినార్ నిర్వహించ తలపెట్టినట్టు వేదిక తెలిపింది.